# ఆగస్టు - 15

- శంకరమంచి పార్థసారధి

ఊరంతా వుత్సాహంగా వుంది.

ఎక్కడ చూసినా మూడు వన్నెల మువ్వ జండాలు ముచ్చటగా ఎగురుతున్నాయ్. ఏవీ తెలీని పసివాళ్లు ఇంట్లో శుభకార్యం జరుగుతున్నట్లు రంకెలేస్తుంటే అన్ని తెలిసి అన్నిటిని అమర్చుకున్నవాళ్ళు అంతకంటే వుత్సాహంగా వున్నారు. అన్ని తెలిసి ఏవీ లేని వాళ్ళు మాత్రం స్థబ్ధుగా పట్టనట్లు ఇళ్ళలోనే వుండిపోయారు. ఎక్కడ చూసినా ఖద్దరు లాల్చీల వుద్రేకపరిచే ఉపాన్యాసాలు పడికిలి బిగించి ప్రతిజ్ఞలు, హామీలు.... మైకుల్లో దేశభక్తి గీతాలు ...నిజంగా వుత్సాహంగా వుంది.

అదే ఊళ్ళో ...అదే రోజు....

గుడిసెల ప్రాంతం అంచేత దోమలు, మురుగుకాలవ, ఆకలి, అన్యాయం, అక్రమం అన్నీ వున్నాయ్. ఆ గుడిసెల్లో ఓ గుడిసె చుక్కమ్మది. దానికి మొగుడు లేడు. తాగి చచ్చిపోయాడు. కాని పిల్లలున్నారు. వాళ్ళకోసమే చుక్కమ్మ బతికుంది. వాళ్ళకోసమే కూలీ పని చేస్తోంది. వాళ్ళకోసమే రాందాసుకి లొంగిపోయింది.

రాందాసుని అంతా దాసు అని పిలుస్తుంటారు. అక్కడున్న రెండు వందల గుడిసెల్లో జనానికి వాడు నాయకుడ. ఎలక్షన్లప్పుడు ఎవరికి ఓటెయ్యాలో చెప్తాడు. ఏ కాంట్రాక్టరు వద్ద ఏ పని చెయ్యాలో గూడా వాడే చెప్తాడు. ఎంత పుచ్చుకోవాలో ఎంతకి వేలిముద్ర వెయ్యాలోగాని, తనెంత పుచ్చుకుంటున్నాడో మాత్రం చెప్పడు. మనిషి రెండు కాళ్ళపై నడుస్తున్న దున్నపోతులా వుంటాడు. నల్లగా, కళ్ళు ఎర్రగా , బుర్రమీసాలు, ఖద్దరు లాల్చీ. నొసటన పొడుగ్గా ఎర్రటి బొట్టు, చుక్కమ్మ మొగుడు పోయాక దాసు లోపల సంతోషపడి పైకి మాత్రం బాధపడ్డాడు.

చుక్కమ్మ వుండేది గుడిసెలోనే అయినా మేడల్లోవుండే మగాళ్ళకి గూడా బుర్రలు పాడుచేసేటంత చక్కనమ్మ. అంచేత దాసు, మోజుతోని చుక్కమ్మ గురించి ముందు ముచ్చటపడి, తర్వాత ఆశపడి, ఆ తర్వాత ఏం చెయ్యాలో ఆలోచించి ప్రతి రోజూ

ఎమ్మెల్యే క్వాటర్స్ చుట్టూ తిరిగినట్లు దాని గుడిసెచుట్టూ తిరగనారంభించేడు. చుక్కమ్మకి కొద్ది రోజుల్లోనే అర్థం అయింది. ఆలోచించుకుంది.

ఇటు చూస్తే పిల్లలు, ఆకలి, అటు చూస్తే రాతి ప్రపంచం . ఇంకోళ్ళ గొడవే వాళ్ళకి పట్టదు .... మధ్యలోతాను ....అరచేతిలో స్వర్గం చూపిస్తూ – మొదటి నించి దానికి దాసంటే అసహ్యం, రోత. కారాణాలు వ్యకితమైనవి. వాడిన చూడంగానే దానికి అదేం శాపమూ మరుగు దొడ్డి గుర్తుకొస్తుంది.

.....అయినా తీవ్రంగా ఆలోచించింది.

ఓ రోజు వాడొస్తే తలుపు తీసి లోపలిక రమ్మంది. వచ్చేడు. అప్పట్నించి రాత్రిళ్ళు వస్తూనే వున్నాడు. మొదటమనిషిలా వచ్చేవడు. తర్వాత తాగి మృగంలా వచ్చేవాడు. ఆ పైన పచ్చి బూతులు కూడా తిట్టేవాడు. అన్నిటిని సహించింది.

వాడు చుక్కమ్మని కాంట్రాక్టరు వద్ద కూలీగా చేర్పించాడు. కొన్నాళ్ళు పని పూర్తికాగానే కూలీ డబ్బులు నేరుగా చుక్కమ్మ చేతిలో కనపడేవి. వాళ్ళ వాళ్ళ కమీషన్లుపోను. కానీ తర్వాత తర్వాత పద్దతి మారింది. దాసు గాడు పుచ్చేసుకున్నాడు. వేలిముద్ర వేసాక, డబ్బులు దాసునడుగు అనేవాళ్ళు.

చుక్కమ్మ దాసునడిగింది. నిజమేనన్నాడు. తన దగ్గర దాస్తున్నాననేవాడు

కొంత చేతిలో పెట్టేడు. రాజీపడటం అలవాటు చేసుకున్న చుక్కమ్మకి సరిపెట్టుకోవటం పెద్ద కష్టం కాలేదు.

రోజులు అందరితో పాటు ఆమెకి గడుస్తున్నాయ్

ఆ రోజు ....దేశభక్తి గీతాల మధ్య వుపన్యాసాల రొదల మధ్య చుక్కమ్మ గుడిసెబయట నిలబడి దాసుకోసం ఎదురుచూస్తోంది. గతత రెండు రోజుల రెక్కల కష్టం వాడి ఖద్దరు లాల్చీ పొడుగు జేబులో వుంది.

మినిష్టరుగార్ని అలా పంపించి వస్తానని వెళ్లేడు. ఆరోజు మినిష్టరుగారు ఆ బస్తీకొచ్చేడు. దాసే తీసుకోచ్చేడు. మినిష్టరుగారితో పాటు సమానంగా కార్లోంచి దిగేడు. జెండా ఎగరేసారు. మంత్రిగారు . ఉపన్యాసం దంచేరు. పిల్లలకి బిళ్ళలు పెద్దవాళ్ళకు ఆశలు పంచి మంత్రిగారు కారెక్కారు. ప్రక్కనే వున్న చుక్కమ్మ దాసుని రహస్యంగా కూలీ డబ్బులడిగింది. మంత్రి గార్ని పంపించి వస్తానని వాడూ కారెక్కాడు. ఇంత వరకూ అయిపూఅజా లేదు. ఎండ పెరుగుతోంది. పిల్లల ఏడ్పులు పెరుగుతున్నాయ్. చుక్కమ్మ కి కోపంగా వుంది. అసహ్యంగా వుంది. గదిలో బంధించి పొగపెట్టినట్లు........

మధ్యాహ్నం ఒంటిగంటకు దాసు వచ్చేడు. బాగా తాగి కిళ్ళీ చారలు పెదాల ప్రక్కల్నించి రక్తపు మరకల్లాగా కనిపిస్తున్నాయి. లోపలికి రాగానే చుక్కమ్మ తనకు రావలసిని డబ్బులడిగింది. ఆ ప్రశ్నకి వాడు పగలబడి నవ్వేడు.... మంచంపై వ్రాలి కన్ను గీటేడు.

చుక్కమ్మ డబ్బుల్ని మళ్ళీ అడిగింది, బియ్యం తెచ్చి పిల్లలికి ఆకలి తీర్చాలంది. దాసు డబ్బుల్లేవన్నాడు సగం డబ్బులు సొంత పెళ్ళానికిచ్చి మిగతా సగం సొంత పొట్ట నింపటానికి వాడేనని సెలవిచ్చేడు.

చుక్కమ్మకి ఏడుపుగా లేదు. కోపం వచ్చింది. మొదటిసారిగా ఆలోచనొచ్చింది. తానెందుకిలా బానిసలా బ్రతకాలన్న వివేకం చటుక్కున పుట్టుకొచ్చింది. పైవాళ్ళ పరిచయాల్ని ఆసరగా తీసుకని తన క్రిందున్న తన లాంటి అమాయకజనాన్ని వీడెలా మోసం చేస్తున్నాడో తెలిసొచ్చింది. దానికి రక్తం కాగింది. వొళ్ళు వేడెక్కింది. కళ్ళు ఎర్రబడ్డాయ్, కోపం కమ్మేసింది, ఆవేశం ముంచేసింది.

దాసు దాన్ని చెయ్యిట్టి లాగేడు. నిలబడాలన్న దాని ప్రయత్నంలో దాని చేతికి ఇనుప పొగగొట్టం తగిలింది. ఆ వస్తువుని చేతిలో బిగించి పట్టుకుంది.

...... కొద్ది క్షణాల్లో మైకులోంచి వస్తున్న దేశభక్తి గీతా మధ్యన ఓ మనిషి ఆర్తనాదం వినిపించింది.

వెంటనే చుక్కమ్మ గుడిసె బయటికొచ్చింది. ఆకాశం వంక చూసింది. ఎగురుతున్న పక్షుల్ని పరీక్షగా చూసింది. గాలిని గుండెల నిండుగా పీల్చుకుంది. ఆపైన పెద్దగా, హాయిగా , నిండుగా నిర్మలంగా నవ్వుకుంది.

ఆరోజే ..... ఆగస్టు 15.

**------- అయ్యిపోయింది -------**